# 9

చిరునవ్వు నవ్వుకుంటూ, కళ్ళ నీరు కారుస్తూ సోమన్న మేనమామ కాళ్ళమీద పడ్డాడు. "మామా! మా బాబు పేరు హచ్చి, నువ్వు సెప్పింది ఇనుకుంటా! ఈ పొలం పొలిమీర దాటి వెళ్ళితే నన్ను బలెయ్యి!" అన్నాడు.

ఆతనిమాటలలో సత్యవాక్కు వారి హృదయాలలో మారుమోగినది.

అప్పలమ్మ 'సింహాదిరప్పన్నా, నీ దయ' అంది. పచ్చలయ్య 'నా లచ్చిమి, నువ్వు బర్తనేరుకున్నావా తల్లీ' అనుకున్నాడు. పైడమ్మ ముసిముసినవ్వును నవ్వుకొని పైట సర్దుకొంది. పొలంకన్నె లచ్చిమి సిగ్గుతో తన పైట తాను సర్దుకొంది.

# అసురకన్య

## మొదటి భాగము

కక్షీవంత మహాఋషి కుమారుడు సుధన్వుడు సూర్యాశ్వంలా బలిష్ఠుడు, ఇంద్రునివలె ఆజానుబాహుడు.

అతని నవ్వులు అశ్వినీ నక్షత్రంతో చేరిన రాకాచంద్రుని కిరణాలు. ఆతని కోపము ఆరుద్రాయుక్తాదిత్య మాస మేఘపర్తిత శంపాలతవలె జాజ్వల్యమానమైంది. సుధన్వుని సౌహార్దము కమలదళశీతలము.

ఆతని ధనర్వ్యముక్తశరీరము ఇంద్రవజ్రసమము. ఆతని యుద్ధనాయకత్వము వృత్రాసురుని ఎదుర్కొనే ఇంద్రవిజయత్వం వంటిది.

పవిత్ర మంత్రద్రష్ట కక్షీవంతుడు తన కుమారుని దస్యుహారుడితడే అని ఆశీర్వదించాడు.

తల్లిదండ్రులకు మ్రొక్కి అనుమతిపొంది ఆర్యసైన్యాలను నడుపుకొంటూ సింధూనదితరంగాలను నావలలో దాటాడు సుధన్వుడు. పర్వతాలుదాటి, అసురదేశంలో విడిది చేసి అసురరాజును యుద్ధానికి పిలిచాడు.

అసురులు ఉత్తమనాగరికులు, మిత్రావరుణాది దేవతా భక్తులైన ఆర్యులకు విరోధులు. ఆర్యరాజైన సుధన్వుడు ఉత్తమవీరులధివసించి ఉన్న రథాలతో, గాలితో ఎగిరే ఉత్తరీయాంచలాలు కలిగిన అశ్వికులతో తమ రాజ్యంలోనికి చొచ్చి

వచ్చాడని తెలియగానే అసురులు అఖండ క్రోధంచేత మండి పోయారు. వారికళ్ళల్లో విస్ఫులింగాలు రాలాయి.

ఉషోబాల దరస్మిత కాంతులు ప్రసరించిన మంచుశిఖరాల బోలిన సత్త్వాలైన అసురులు అశ్వాలను రథాలకు పూన్చి ఉత్తమాజానేయాల అధివసించి ఆర్యుల నాశనంచేయడానికి సైన్యాల ఆయత్తంచేసుకొనివచ్చారు.

## 2

అసురరాజుకుమార్తె పాంచర నవయౌవనవతి. పద్దెన్మిదివర్షాల పారిజాతపుష్పంలాంటి ఎరుపు తెలుపుల అందాల బొమ్మ. పుత్రులులేని అసురరాజు పుత్రికను వీరునిలా పెంచాడు.

ఆమె కవచం ధరించి, మూడుధనువుల బల్లెము ముష్టిని పట్టింది. తండ్రికి చక్రరక్షకురాలై ఒక ఉన్నతాశ్వాన్ని అధివసించి యుద్ధానికి బయలుదేరింది.

మేరుపర్వతసానువుల మిలమిలలాడే లేత దేవదారు సౌష్టవంతో వెన్నెలలో సాయంకాలపు ఉషఃకాంతులు రంగరించిన శరీరకాంతిలో వెలిగే తన బాలికను చూచి అసుర రాజు గర్వంతో రథంమీద నిలిచినాడు.

ఆమె అధివసించిన ధవళాశ్వం తన్ను స్వారిచేసే సుందర మూర్తిని ఎరిగిఉన్నదా అన్నట్లు గర్వంతో, వేగంతో, అసుర రథాశ్వాలను పందేనికి ఆహ్వానిస్తున్నది.

బంగారు శిరస్త్రాణంక్రింద నర్తించే ముంగురులు ఆమె దివ్యసుందరవదనాన్ని ఇంకా మనోహరంగా పనిచేస్తూండగా, ఆమె చిరునవ్వులను దిరిశనపూవులులా విరజిల్లుతూ స్వారి చేస్తున్నది.

తనస్థులను పోగొట్టు సౌందర్య స్వరూపురాలైన అపాంచర వేగముగా గుఱ్ఱాన్ని తోలుతూ తండ్రిని అనుసరిస్తున్నది.

తెలుపు ఎరుపుల కాంతితో ఉషోదేవిలా ఆ పాంచర సూర్యునివంటి తండ్రి రథానికి ముందు వస్తున్నది.

ఇంతలో రెండు సైన్యాలు తలపడినవి. అసురులు మహావీరులు, దృఢకాయులు. ఆర్యులు మగటిమిగల బంటులు. అసురార్యులు ఒకే రూపురేఖావిలాసాలు కలవారు. ఆ సంకులసమరంలో కవచాదులలో మాత్రం భేదాలున్న ఆ రెండు సైన్యాల వీరులు పాలసముద్రంలో సుడిగుండములోని కెరటాలవలె పోరుసల్పినారు.

పోరు ఘోరమైంది. శరశూలభల్ల ఖడ్గకాంతులు, ముసలముద్గర పరశుగదాద్యాయుధ తాడన నినాదాలు ఇంద్రుడు మేఘాలతో ఆకాశాన అవతరించినట్లే అయింది.

పాంచర తండ్రివక్క నేఉండి తండ్రినీ తన్నూ కాపాడుకొంటూ భయంకర యుద్ధం చేస్తూఉన్నది.

అంతలో అసురార్య యుద్ధనాయకులిద్దరూ ద్వంద్వ యుద్ధాన ఒకరి నొకరు మార్కొన్నారు.

# 3

యుద్ధారంభంనుండి సుధన్వుడు మేఘాలను దూరి వచ్చే వజ్రపాతంలా పొగమంచును చీల్చివచ్చే సూర్యకిరణంలా, అసుర సైన్యాలను చొచ్చి, శంఖంపూరిస్తూ తన సైన్యాలను చేయివిసిరి, విజృంభింపచేస్తూ, అసురనాయకుల్ని బాణాలతో, వివిధాయుధ ప్రయోగాలలో నిర్జిస్తూ పూలతో నిండిన మోదుగచెట్టులా రక్తసిక్తాంగుడై, ఏమీ చలింపకుండా వేగంతో యుద్ధవిక్రాంతుడైనాడు.

అతడు మహావేగంతో అసుర రాజును ఎప్పుడు కదిసినాడో, ఆ క్షణమే చక్రరక్షకురాలై ఆర్యసైన్యం చెండాడే ఉషాదేవిలా ఉన్న పాంచర ముందుకు వచ్చి సుధన్వుని తలపడింది.

ఆర్యరాజు బాలకునివలె నున్న పాంచరను చూచినాడు. బాలుడే అనుకున్నాడు. సుధన్వునకు పాంచర పదునాలుగేండ్ల బాలికవలెనే తోచింది.

సుధన్వుడు:—ఓయి బాలకా, నువ్వు చిన్నవాడవు. నీ తండ్రి పెద్దవాడు. మీ కేతనము మాకు లొంగినట్లు ఒకసారి దింపండి, మీరూ మేమూ సమాధానం కుదుర్చుకొని ఎవరిదారిని వాళ్ళు పోదాంగాక!

పాంచర:—ఓయి ఆర్యవీరుడా! యుద్ధంచేసి అలసివున్నావు. నీ కవచంలోంచి రక్తం సూర్యరథానికి ముందు ప్రవహించే ఎఱ్ఱని కాంతిధారల్లా ప్రవహిస్తూఉంది. నువ్వే నీ పతాకాన్ని దింపినట్లయితే, నువ్వు నీ దేహం బాగుపడేవరకూ

మా కోటలో అతిథిగా ఉండవచ్చును. మీ సైన్యాలు మా రాజ్యానికి అతిథులు.

సుధ:---ఓ పుణ్యమూర్తీ! నీ మాటలు మధురాలు కురిసే కలకంఠికంఠ స్రవితగానస్వనాలులా వినబడుతున్నాయి. ఇంత చిన్నతనంలో నీకు యుద్ధమేమిటయ్యా?

పాంచర:—ఓయి యుద్ధమే జీవితంచేసుకొన్న కర్కశుడా! నీకు బాలు డెవరో, బాలిక ఎవరో తెలియదో? ఇవిగో నా బాణాలు రుచిచూడు. ఇవి వాలుచూపులుకావు. ప్రాణాలు హరించే తూపులుసుమా!

## 4

సుధన్వుడు బాల సౌందర్యానికి ఆనందించి ఉప్పొంగిపోయాడు. ఈ బాలవీరుడు బాలికా? ఓహో, ఏమా బాలిక సౌందర్యము భూమి దున్నినవెనక విత్తులుజల్లగా ఇంద్రదేవుడు తన మేఘాలతో చల్లని వృష్టి కురిపించినప్పుడు బయలుదేరిన పచ్చని మొక్కలతో నిండి ఉన్న పొలంలా ఉన్నది!

ఆ బాలిక అందము, వెన్నెల ప్రసరిస్తుండగా, ఆ వెలుగులోని అమృతం ఆస్వాదిస్తూ తీవలుసారించిన, దేవతలకు అతిప్రియమైన సోమలతలా ఉన్నది.

ఆ బాలిక మనోజ్ఞత్వము హిమాలయశిఖరాల పుట్టి గీతాలాలపిస్తూ లోయలలో ప్రవహించే వితస్తానది ప్రవహి పులా ఉన్నది. సుధన్వుడు ఈ ఆలోచనలు తన హృదయాన్నిం వెన్నెల నింపగా తన రథంమీదనుంచి డిగ్గనురికాడు. అత డా

రథముమీదే పగ్గాలు విడిచినాడు. అతడు ఆ రథంమీదనుంచి యజ్ఞభాగం భోగించడానికి ఆకాశంనుంచి దిగివచ్చే మరుత్తు నిలా ఉన్నాడు.

ఆతడు తన మీదపడే అసురుల బాణాలు లెక్క చేయలేదు. అత డాయుధాలన్నీ రథంమీదనే ఉంచివేశాడు. ఆతని చిరునవ్వుమోము, ఆతని వెలిగిపోయే ఫాలం, అతని విశాలమైనకన్నులు, ఆతని సమున్నతమూర్తిత్వము, అతనివిక్రమము అతని అశ్వినీదేవ సౌందర్యము, అసురవీరుల్ని సమ్మోహపరచింది. అసురవీరులందరు యుద్ధముమాని, అతనివైపే చూస్తూ ఉండిరి. ఆర్యనాయకులూ యుద్ధం మానివేశారు.

పాంచరవైపుచూస్తూ "ఓ దివ్యసౌందర్యగాత్రీ, ఓ ఇంద్రాణివంటి పరాక్రమం కలదానా, నిన్ను వాయుదేవుడు మేఘాలను కొనిపోయినట్లుగా మా సప్తసింధు దేశానికి కొనిపోగలను. ఓ అనన్యదివ్యమనోహరరూపంకల అమరకన్యా, ఓ బాడలివంటి తేజస్సుకలదానా, నిన్ను ఆదిత్యుడు బాడలియైన సంజ్ఞాదేవిని సముద్రంలోనుండి కొనిపోయినట్లు కొనిపోగలను." అని ఉచ్ఛైశ్శ్రవాన్ని కేకవేసి సముద్రకెరటంలా కదిలాడు. సింహంలా ముందుకు సాగాడు.

"ఓ ఆర్యశూరుడా! రావయ్యా నా దగ్గరకు; నేనే నిన్ను జయించి, నిన్ను నేను ప్రియుణ్ణి చేసుకొని, తన హృదయంలో యామినీచంద్రుణ్ణి దాచుకొన్నట్టు నిన్ను దాచుకొంటాను. ఓ మిత్రునివంటి పరాక్రమంకలవాడా, ఓ అగ్నివంటి తేజస్సుకలవాడా, మంచిగంధంతరువు అగ్నిని దాచుకొన్నట్టు నిన్ను నా హృదయంలో దాచుకోగలను" అని కేకవేస్తూ

గుబ్బంపై రక్తసిక్తాంగియై పూవులుపూచిన ఫలాశవృక్షంలా అధివసించి ఉన్నది.

తమ రాజకుమార్తెకు అడ్డంవచ్చిన అసురవీరుల్ని సుధన్వుడు లెక్కచేయక ముళ్ళడొంకలను విదల్చుకొనుచు తన ప్రియురాలైన ధేనువును కలిసికొనబోయే అడవి వృషభంలా, ఆవలిఒడ్డున ఉన్న తనరాణిని చేర మహాప్రవాహం నడికి ఎదురీదిపోయే ఐరావతంలా, అతడు అసురసైన్యాలను ఈవలావలకు నెట్టివేస్తూ పాంచరదగ్గిరకు చేరినాడు.

పాంచర మహాసంతోషాన నవ్వుతూ, తన నిశిత ఖడ్గాన్ని మెరుమువైపు తిప్పి సుధన్వుడు నిరాయుధుడై ఉండడంచేత, మెరుముువేగంగా అతన్ని ప్రహరించడం ప్రారంభించింది.

సుధన్వుడు తన తలమీద శిరస్త్రాణం పెరికి, ఎడమ ముష్టితో మహావేగంతో పరపే ఆమె ఖడ్గప్రహారాలను ఆ శిరస్త్రాణంపై పడేటట్లు, ఆమెను సమీపించి, కుడిచేత్తో ఆమెకుడిచేయి పట్టుకొని ఖడ్గంలాగి ఆవలకు విసరివైచాడు!

ఇంద్రునివలె బలంగలవాడున్నూ, అశ్వినీకుమారుల వలె అందగాడును, సవితృనివలె కాంతివంతుడును అగు సుధన్వుడు ఆమెనడుముచుట్టూ చేతులువేసి అశ్వాన్నుండి ఎత్తి తీసి, ఆమెను గాఢంగా తన హృదయానికి అదుముకొన్నాడు.

ఆమె సంతోషాన ముసిముసినవ్వులు నవ్వుతూ ఆ దృఢ పరిష్వంగనంలో ఇరికిపోయి, అసురవీరులు చూచి ఆశ్చర్యంపొందుతూఉండగా, తండ్రి అయిన అసురరాజు

నివ్వెరగంది చూస్తూఉండగా, రెండుచేతులా ఆతనిచంపలు చుట్టి ఆతనికళ్ళల్లోకి తేరి పారచూచింది.

ఆమెచూపులు వెన్నెలకిరణాలు. మానవ సరోవరం లోతులలోనికి ప్రసరించినట్లయినది ఆమెచూపులు కల్పవృక్షం పైన అమృతవర్షం కురిసినట్లయినది.

అతడామెను చూచి "ఓ హృదయేశ్వరీ! ఓ అసుర మహారాజబాలికా, హిమాలయ పర్వతాగ్రాలు మేఘాలను ధరించినట్లుగా నిన్ను నా హృదయంలో ధరిస్తున్నాను. నీ నా ప్రణయమంత్రము, కచుడు శుక్రునికడ గ్రహించిన మృత సంజీవినిలా మన ఉభయసేనలకు అమృతత్వం ప్రసాదించు గాక!" అని అంటూ ఆమెను పెదవులపై ముద్దిడుకొన్నాడు.

పాంచర గాయత్రిమంత్రంలాంటి పవిత్ర స్వర యుక్తంగా నవ్వింది. ఆమె సుధన్వునిహృదయంలో తన మోము దాచుకుంది.

ఇంతలో సాయంకాలము ఆదిత్యుడూ, అతని వెలుగూ సముద్రంలో కుంకిపోయిన రీతిగా, దివ్యపరిమళావృతమైన పూవు చెట్టునుండి రాలిపోయిన రీతిగా, పాంచరకౌగిలిలో సుధన్వుడు ఆ యుద్ధభూమిలో కూలిపోయినాడు.

సుధన్వుని ప్రాణాలు పాంచరప్రాణాలు ఆ అమృత మృతిలో లీనమైపోయినవి. అసురసైన్యాలలో, ఆర్యసైన్యా లలో హాహాకారాలు మిన్నుముట్టినాయి.

## రెండవ భాగము

అహమ్మదాబాదు కాంగ్రెసు కాంధ్రదేశాన్నుండి ప్రతినిధులుగా వెళ్ళినవారిలో డాక్టరు వైకుంఠరావు ఎం. బి. అండ్ సి.యం. ఒకడు. వైకుంఠరావు మాంచి ఒడ్డూపొడుగూ వున్నమనిషి ఆటలన్నిటిలో అందెవేసినచెయ్యి. మదాసు వైద్యకళాశాల ఆటజట్టులన్నిటికీ నాయకుడు. విద్యార్థులలో మేటిఅయిన టెన్నిస్ ఆటకాడు. న్యాయకళాశాల, పచ్చియప్ప కళాశాల, క్రిస్టియన్ కళాశాల, ప్రభుత్వ కళాశాలలు జట్టు లలో ఒకటిన్నీ అతడు కాలేజీవిద్యార్థిగా ఉన్నంతకాలం కాలి బంతి, హాకీబంతి. టెన్నిస్ ఆటలలో వైద్యకళాశాలతో పోటీ చేసి మొదటిరంగమైనా దాటలేకపోయాయి.

ఎన్నివేల సంవత్సరాలనుండో భారతదేశంలో విజృం భించిన ఆర్యవీరుల వీర్యమూ పరాక్రమమూ అతనిలో మూర్తీ భవించాయిరా అనేవా రతని స్నేహితులు.

నలుగురు స్నేహితులతోటి ప్రతినిధులుగా స్వగ్రామ మైన గుడివాడనుండి బయలుదేరి బెజవాడ, శికిందరాబాదు, ఎల్లోరా, అజంతా, జాల్గాన్, బార్డోలీల మీదుగా అహ మ్మదాబాదు చేరుకున్నాడు.

అహమ్మదాబాదు కాంగ్రెస్‌లో కుర్చీలూ బల్లలూ లేవు. అందరూ ఆ మహాశిబిరంలో క్రింద కూర్చోవలసిందే! ఒక ప్రక్క ఖిలాఫత్ మహాసభ, ఒకప్రక్క స్వదేశీవస్తు, ఖాదీ ప్రదర్శనము. దేశ దేశాలనుండివచ్చినలక్షలకొలదిజనం. అక్కడే సబర్మతినదీతీరాన్ని మహాత్మునిఆశ్రమం. అహమ్మదాబాదు

ఏనాటి భారతీయమహాత్ముల శ్రేష్ఠ గాథలనో స్మరింపచేస్తున్నది.

భారతదేశం తనకు త్వరలో విముక్తి వస్తున్నదని, పవిత్ర ప్రపంచ ప్రఖ్యాత అపర అహింసావతారమైన మహాత్ముని చూస్తూ మురిసిపోతున్నది.

ఆ వైభవం స్నేహితులతో చూస్తూ భరతదేశంలో జరగబోయే అఖండ సత్యాగ్రహయుద్ధానికి మహాత్మునికే నాయకత్వ మిచ్చి, శ్రీ శ్రీ హకీం అజ్మల్ ఖాను గారి యాజమాన్యాన కాంగ్రెసు తీర్మానం చేసింది.

వైద్యకళాశాలలో వైకుంఠరావు ఆఖరుసంవత్సరం చదువుతూఉండగా మహాత్ముని దివ్యవాక్యాలు భారతదేశం అంతా మారుమోగాయి. వైకుంఠరావు ఆతక్షణమే కళాశాల వెడలి పైకి వచ్చేద్దామనుకున్నాడు. కాని ఇంక మూడు నెలలు ఓపికపట్టి ప్రభుత్వోద్యోగంకోసం తాను నిశ్చయించుకొన్న కార్యక్రమం మానివేసి విడిగా వైద్యవృత్తి చేసుకుంటూ కాంగ్రెసుకార్యక్రమంలో పాలుగొంటూఉండాలని వైకుంఠుడు నిశ్చయం చేసుకున్నాడు.

నాగపూరు కాంగ్రెసుకు వెళ్ళాడు. అప్పటికి అతడు హౌసుసర్జనుపనిలో ఉన్నాడు. ప్రసూతివైద్యము, కళ్ళవైద్యం పూర్తిచేసి గుడివాడలో వైద్యవృత్తి ప్రారంభించాడు. ప్రారంభించిన మూడునెలలలో వైకుంఠునికి నెలకు అయిదారువందలు దొరుకుతున్నాయి.

ఈ కారణాలన్నిటిచేత ఇదివరదాకా పెళ్ళిమాట తలపెట్టక, ఇప్పుడెందుకు సంగతి, తర్వాత చూచుకొనవచ్చునులే అని ఊరుకున్నాడు.

# 2

అహమ్మదాబాదు కాంగ్రెసు అద్భుతంగా జరిగింది. అక్కడనుండి స్నేహితులను "ఆబూ పోయి దిలావరా గుడులనుచూచి వద్దాం రండరా!" అని ప్రోత్సహించాడు వైకుంఠరావు.

ఢిల్లీ మేలెక్కి, ఆబూరోడ్డుస్టేషనులో దిగారు మనవాళ్ళందరూ. ఆబండిలోనే ఆ సమయంలోనే తహిమీనా బాట్లివాలాకన్యయు, ఆమె తండ్రి బాట్లివాలాగారు కూడా మెయిలులో ఒక మొదటితరగతి పెట్టిలోంచి దిగారు.

తహిమీనా కన్య పార్శీబాలికలలో దేవకన్యలాంటిది. గులోబకావలీకన్యకు అందాలు నేర్పే మనోహరాంగి.

తహిమీనా ఇంగ్లండులో చదువుకుంది ఆంగ్లబాలలను వారిచదువులోనే వారిని త్రోసిరాజుచేసింది. ఆమె ఎం. ఏ. పి. హెచ్. డి. పరీక్షలలో మొదటగా జయమంది ఇంటికి వచ్చింది.

ఆమె ఇంగ్లండులో చదువుకొనే రోజులలో ఆటలలో మొదట—! నాట్యంలో మొదట. భారతీయ బాలికఅయినా ఆమె అనేక ఆంగ్ల ఉన్నతకుటుంబాలవారి ఇళ్ళల్లో వారి కుటుంబాలలోని బాలికలాగే తిరిగేది, ఆమె అంటే అంత స్నేహం ఆ బ్రిటిషుబాలలకు.

తహిమీనాను చూచినవాళ్ళందరూ కొంచెం వేడిదేశంలోవున్న ఇంగ్లీషుబాలికే అనుకునేవారు.

టెన్నిస్, పరుగు, ఈతపందేలలో మొదటగా వచ్చేది. తహిమీనాను ఒకరిద్దరు పెద్దకుటుంబాల ఆంగ్లబాలురు పెళ్ళి చేసుకుందామని చూశారుకూడా.

ఎందుకనో తహిమీనాకు పెళ్ళిఅంటే ఎప్పుడూ ఇష్టంలేదు. అనేక పార్శీ పెద్దలు ఆ బాలికకు చాలా మంచి సంబంధాలు తెచ్చారు.

ఆ బాలిక స్త్రీగా ఎంత అందగత్తో, మగవీరుడులా అంత అల్లరిపిల్ల. ఎప్పుడూ మగవానిలా వేషం వేసుకుని గుర్రం స్వారి చేసేది. కారునడిపేది. ప్రయాణంలో ఎప్పుడూ మగ వేషంలోనే ఉండేది.

## 3

బాట్లీవాలాగారు కోటీశ్వరులు. ఆయన ఎన్నో కంపెనీలు పెట్టించి వాటిని అత్యంత లాభం కొనివచ్చే సంస్థల చేశాడు. ఎన్నో పరిశ్రమసంస్థలకు ఆయన ముఖ్యాధ్యక్షుడు.

ఆయన మొదటినుంచీ గాంధీమహాత్ముని శిష్యులలో ఒకడయ్యాడు. అందుచేతనే ఈ సంవత్సరానికి ముందు సంవత్సరంలో ఆయనకు ప్రభుత్వం పెద్దబిరుదం ఇద్దామనుకున్నారు. కాని బాట్లీవాలాగారు ఖండితంగా తన కక్కరలేదని కబురు చేశారు.

తండ్రిగారూ కుమార్తెయూ అహమ్మదాబాదు కాంగ్రెసుకు బొంబాయినుంచి ప్రతినిధులుగా వచ్చారు.

వారూ కాంగ్రెసు అయిపోగానే ఓరోజు ఆబూచూచి మళ్ళీ వద్దామని బయలుదేరి వెళ్ళారు.

ఆబూరోడ్డు స్టేషనులో ఒక మంచికారు వచ్చిఉంది, స్టేషన్‌లో దాదాభాయి మెనక్జీ తన చుట్టమైన బాట్లివాలా కుటుంబానికి కారువేసుకొని వచ్చాడు ఆతిథ్యం ఇద్దామని.

స్టేషన్‌లో బాట్లివాలా తండ్రికుమార్తెలిద్దరకూ స్వాగత మిచ్చి ఆబూపట్నం తీసుకుపోయాడు దాదాబాయి.

ఆ మెయిలుబండిలోంచి దిగి వైకుంఠరావు అతని స్నేహితులూ ఉదయము అక్కడ ఇన్ని పూరీలు తిని, పాలు తాగి బస్సుమీాద ఆబూ చేరారు.

ఆబూనగరం ఆరావళీ పర్వతాలలో దత్తాత్రేయ శిఖ రానికి అయిదువందల అడుగుల దిగువను ఉన్నది. ఆబూ ఎత్తు ఆరువేల అడుగులకు తక్కువగా ఉంటుంది. ఆబూనగ రానికి రోడ్డు వంకరటింకరగా పైకి ఎక్కుతుంది.

బస్సు వెళ్ళుతూంటే రోడ్డుమీాద ఒక పెద్దపులి పడు కుని ఉంది. బస్సుఆపి విద్యుచ్ఛక్తికొమ్ము, మాచురాలు బూరా అల్లరి హంగామా చేస్తే ఒక్కగంతువేసి దిగువ లోయ లోకి పులి మాయమైంది. అందరి ప్రయాణీకుల ప్రాణాలు లేచిపోయాయన్నమాటే.

వైకుంఠ :—ఒరే విశ్వం! ఇప్పటికి చూశానురా బరి మీాద పెద్దపులిని.

విశ్వం :—నేనూ పెద్దపులులను సర్కసులలోనూ, జంతుప్రదర్శనశాలలోనేగా చూసిందీ.

రామం :—ఓహో ఏమి గొప్పగా ఉందిరా! ఏమి దర్జారా, మనకేసి నవ్వుతూ చూసినట్లుగా అయిందిరా.

45328
శ్రీకాకుళం



వైకుంఠ :—దిగివెళ్ళి దాన్నితట్టి దాంతో ఆడుకుందా మనిపించింది.

కృష్ణమూర్తి :—నువ్వు దుష్యంతుడు కొడుకువా? లేక కాశీమజిలీకథలోని సింహదమనుడ వనుకున్నావా?

ఆబులో ఒక సత్రంలో మఖాంపెట్టి మన స్నేహితులు దిలావరాగుళ్ళు చూశారు. అచలేశ్వరదేవాలయం చూశారు. దత్తాత్రేయ శిఖరం ఎక్కారు.

మూడురోజులైన తర్వాత ఆబునగరానికి రెండుమైళ్ళ దూరంలో ఒక లోయలో వశిష్ఠాశ్రమం చూడడానికి వెళ్ళారు.

## 4

వశిష్ఠాశ్రమం ఎంతో అందంగా ఉంది. ఎన్నో ఫల వృక్షా లున్నాయి. ఒక సెలయేరు ప్రవహిస్తూ ఉంది.

ఆ ప్రకృతిదృశ్యము. అలాంటి ప్రదేశాలలో ఋషులు ఆశ్రమాలు ఏర్పాటుచేసుకొన్న భావమూ సమన్వయం చేసు కుంటూ వైకుంఠరావూ స్నేహితులూ తిరిగి ఆబూనగరం వస్తూ ఉన్నారు.

చలి హిమాలయాలలోని చలిలా గజగజ వణికిస్తూ ఉంది.

అయిదుగురు స్నేహితులూ మాట్లాడుకుంటూ వస్తూ న్నారు. స్నేహితుల ఒట్టుకు ముందుగా, ఒకవృద్ధుడు, ఒక బాలుడు అంగ్లదుస్తులు ధరించి నడుస్తున్నారు. వృద్ధుని తలపై

పార్సీటోపీ ఉంది. ఆ బాలుడు హేటు ధరించి ఉన్నాడు.

ఇంతట్లో వెనకవచ్చే వైకుంఠరావు జట్టుకు "ఓహో హో" అన్న ఒక కేక వినబడింది. ఆ కేకలో ఏదో వర్ణింపలేనిభయం గర్భీకృతమై తోచి, మనవాళ్ళందరు ముందరకు పరుగెత్తారు. ఆ ఇద్దరూ ఉన్న స్థలం దగ్గిరకు వెళ్ళగానే మనవాళ్ళ ప్రాణాలు నిలువునా తెలిపోయాయి ఎదురుగుండా పడుకుని వీరి అందరి వైపు ఒక మహావేదాంతిలా చూస్తోంది ఒక పెద్దపులి.

మనవాళ్ళందరూ బిఱ్ఱబిగుసుకు పోయారు! ఆ కొత్త పురుషులూ బిఱ్ఱబిగుసుకుపోయిఉన్నారు.

ఇంతట్లో ఉరుములా ఒక పెద్ద బొబ్బపెట్టి తన చేతిలో విలాసంగా తిప్పుకుంటూవున్న ఒక అడవి దుడ్డుకఱ్ఱను పైకెత్తి వీళ్ళందరికీ ముందుకు ఉరికాడు వైకుంఠరావు!

ఆ కేకతో పెద్దపులికి ఏమి కంగారు పుట్టిందో ఓ ఛెంగున గంతువేసి ఆ దారిపక్క దుబ్బుల్లోకి ఉరికి నిముషంలో మాయమయింది.

పెద్దకేకలు వేసుకుంటూ ప్రాణాలు బిగపట్టుకుని వారందరూ ఆబూనగరం చేరారు.

బాట్లివాలాగారు వారందరికీ ముఖ్యముగా వైకుంఠరావుకీ కృతజ్ఞత తెల్పి తమబస చేరుకున్నారు.

## 5

ఆబూనగరం చుట్టుపక్కలు అంతా చూచి సామాను న్ను ఒక స్నేహితుణ్ణి బస్ మీాద పంపి, మిగతా నలుగురూ

నడుస్తూ పాటలు పాడుకుంటూ, అయిదవ రోజు సాయంకాలం వైకుంఠరావూ స్నేహితులూ ఆబూస్టేషనుకు పోతున్నారు.

కొండదిగి కొంతదూరం పోయేటప్పటికి, ఆ రోడ్డు మీద ఒక కారుచుట్టూ ఒక భిల్లుజట్టు కనబడింది. వీళ్ళు నలుగురూ దగ్గరకు వెళ్ళేసరికి, కొంతమంది భిల్లులువచ్చి వీళ్ళని చుట్టుముట్టారు. వైకుంఠరావు నల్గురైదుగురు భిల్లులును బంతుల్లాపట్టి అవతలకు గిరవాటు వేశాడు.

"ఓరే, వీళ్ళు గాంధిదేముడుజట్టువాళ్ళురా" అని కేకలుపెట్టి కనుమూసి కనుతెరచేటంతలో మాయమై పోయారు భిల్లులు.

అప్పుడా కారులోంచి దిగింది బాట్లివాలాగారు. ఏమిటి విచిత్ర సంధానాలు అని వారూ అనుకున్నారు. వీరూ అనుకున్నారు

తహిమీనా పార్సీబాలిక. ఆ బాలిక హృదయంలో వైకుంఠరావు— పెద్దపులిని అల్లరిపెట్టినప్పటినుంచి, ఏమి చిత్రమో—మకాంపెట్టి కూచున్నాడు. పార్సీ బాలికలు పార్సీతరలతో సాధారణ స్నేహంకన్న ఎక్కువదూరం పోరాదు! అయినా ఆ కొత్తబాలకుడు చీకటిలోకూడా గంభీర వ్యక్తిత్వంతో అస్పష్టమూర్తిత్వంతో పెద్దపులిని తరిమివేస్తూ ఎన్నిసార్లో ప్రత్యక్షంఅవుతూ ఉన్నాడు.

బాట్లివాలా మన స్నేహితులకు వందనాలర్పిస్తూ నవ్వుతూ "మీకూ మాకూ ఈ చిత్రసంబంధం ఏమిటి!" అన్నాడు.

"నేనూ అదే అనుకుంటున్నానండి" అని వైకుంఠ రావు సమాధానమిచ్చాడు. అందరూ కలిసి భిల్లులు రోడ్డు కడ్డంగా వేసిన రాళ్ళూ రప్పలూ ఎత్తి పారవేసి మోటారు కారు సరిగా పోవడానికి దారిచేశారు. కారు వెళ్ళిపోయింది. స్నేహితులు స్టేషనుకు పోయి అహమ్మదాబాదుకు రెండవ తరగతి టిక్కెట్లు కొన్నారో లేదో మెయిలు చక్కా వచ్చింది.

# 6

వెంటనే మన స్నేహితులైదుగురూ ఇటు తిరిగారు అటు తిరిగారు; ఏ సెకండుక్లాసులోనూ ఖాళీ లేదు.

వైకుంఠరావుకు కోపం వచ్చింది. రైలును కదలమని చెప్పినట్లుగా ఈల వేసే గార్డును పట్టుకొని గబుక్కున వెనక్కు తిప్పి "గార్డుజీ నమస్కారం. క్షమించండి! రెండవ తరగతిలో స్థలం అణుమాత్రం లేదు. అహమ్మదాబాదు ప్రయాణం, మొదటి తరగతిలో ఎక్కుతాం. తరువాత స్టేషనులో చార్జి ఇస్తాం; సెలవు." అని పరుగెత్తి ఒక మొదటి తరగతి పెట్టిలో-ఇద్దరే ఉన్న ఆరుసీట్ల దానిలో ఎక్కబోయారు.

పెట్టెగుమ్మంలో తహిమీనా బాట్లివాలా పురుష వేషంలో నుంచొని ఉంది.

వైకుంఠరావు, అతని స్నేహితులు గబగబ ఎక్కబోయారు. తహిమీనా "ఎక్కడానికి వీలులేదు" అన్నది. "ఓయి కుర్రాడా, రైలు కదులుతున్నది; వాదించడానికి వ్యవధి లేదు." అని ఆ బాలుణ్ని నెమ్మదిగా నెట్టుకుపోయి స్నేహితులకు దారిచేసినాడు.

బాట్లివాలాగారు అతికోపంతో లేచి "పశుహా !" అని కేకవేశాడు.

వైకుంఠరావు చిరునవ్వు నవ్వుతూ నేడున్నాడు. ఇంతట్లో తహిమీనా తనతండ్రి చేతికఱ్ఱ తీసుకొని వైకుంఠరావు నెత్తిమీద దబదబ బాదటం ప్రారంభించింది. మరుసటి క్షణంలో ఆ కఱ్ఱ ఆమె చేతులలోంచి ఊడతీసి కఱ్ఱ రెండు ముక్కలు చేసి మూల పడవేశాడు.

ఒక దెబ్బ అతని నుదుటిపై తగిలి చర్మం కొంచెం పగిలి రక్తం బొటబొట కారింది.

"అదేమిటి అమ్మాయీ" అని పార్శీభాషలో బాట్లివాలా అన్నాడు.

వైకుంఠుని తహిమీనా తాడన మారంభించగానే ఆమె తలపై ధరించిన ఇంగ్లీషుటోపీ ఊడి పడిపోయింది. ఆమె జుట్టు ముడివీడి సూటువేసిన ఆ బాలిక వీపుపై పడి ప్రసరించింది. ఆ బాలిక సిగ్గుపడుతూ నిలుచుంది. వైకుంఠరావు ఆమె నంతవరకు బాలుడే ననుకొన్నాడు.

అందమైన బాలుడు అత్యంత సుందరమైన బాలిక అయింది.

ఆమెను తేరిపార చూచినాడు ఆమె అతన్ని తేరిపార చూచింది.

"నీవా!" అని అతడన్నాడు. "నీవా!" అని ఆమె అన్నది.

# 7

దాదాబాయి బాట్లివాలాగా రప్పుడు వైకుంఠుడు పెద్ద పులిబారినుండీ, భిల్లులబారినుండీ తమ్ము తప్పించిన ప్రాణ దాత ఇతడేఅని పోల్చుకున్నాడు.

దాదా:-అయ్యా క్షమించండి. ఆ సీటుపైన కూర్చోండి. మా అమ్మాయి చాలా తొందరపడింది అన్నాడు. స్నేహితు డొకడు గాయానికి కట్టుకట్టాడు.

వైకుంఠుడు నవ్వుతూ "పరవాలేదండి. తొందరలో ఇలాంటి సంఘటనలు వస్తూఉంటాయి."

అతనిపై ప్రసరించిన అందాలచూపులు తహీమినా మరల్చలేదు. వైకుంఠుడు తనచూపులు ఆమెనుంచి మరల్చ లేకపోయాడు.

అహమ్మదాబాదు చేరేసరికి వారూ వీరూ స్నేహితు లయ్యారు. ఇరవైఏళ్ళ బాలిక తహీమినా వైకుంఠుని అహ మదాబాదులో తమ మకాంకడ ఒంటరిగా కలుసుకొంది.

తహీ:—నిన్ను ఎన్నివేల సంవత్సరాల క్రిందటనో కలు సుకున్నట్లుంది. ఇదివరకు మనం ఎక్కడ కలిసికొని ఉంటాము?

వైకుం:—కాంగ్రెసులోనేమో!

తహీ:—కాదు. ఇదివరకే సీమలో నేను యుద్ధం చేసినట్లు, నువ్వు నన్ను ఓడించి—

వైకుం:—ఓడించి నిన్ను మాదేశానికి ఎత్తుకొనిపోయి వివాహమాడినట్టు కలగానికల?

తహి:—నాకు అంతే!

వారట్లు గంటలు మాట్లాడుకొన్నారు. ఆమె నిర్భయంగా నిస్సందేహమయిన మాటలతో వైకుంఠుని తాను ప్రేమిస్తున్నానని చెప్పింది. వైకుంఠుడు "తహిం బానా! నీపేరు ఎంత చక్కగా ఉంది. నిన్ను యుగాలక్రితం పోగొట్టుకొని ఇప్పుడు మళ్ళీ కలిశానా నీతో అన్నభావం నన్ను వీడదు నువ్వే సర్వకాలం నా చూపులలో, నా హృదయంలో, నా సర్వస్వంలో! ఎల్లాగ నిన్నువదలి ఉండటం?" అన్నాడు.

"ఓయి వెఱ్ఱివాడా! నేనూ నిన్ను వదలి ఉండగలనా? ఏమో నేను అసురబాలికనై, నువ్వు ఆర్యబాలకుడవేమో! గులోబకావలీకన్య కథ వినలేదా"

ఒక్కనిముషం వారొకరి నొకరు విడిచిఉండలేకపోయారు.

దాదాబాయిగారికి గొంతులో వెలక్కాయ పడినట్లయింది. పార్శీకన్యక పార్శేతరుణ్ణి ఎలా వివాహం చేసుకోకలదు?

తహిమీనా ప్రేమ మతాలుదాటింది. దేశాలుదాటింది. దేహబలం జ్ఞానబలం కుటుంబ, దేశ, ప్రపంచసేవ చేయడానికి ఎంతముఖ్యమో ప్రేమబలం అంతేముఖ్యం అని ఆమె అనుకుంది. ఒకజాతిని చెక్కుచెదరకుండా కాపాడుకోడం పురాతనవస్తు సంరక్షణభావం కావచ్చును ఆ మ్యూజియం భావం అన్నివిషయాలలోనూ వర్తించదు. శ్రీ జిన్నాగారి వివాహం జాతినిమించి నడిచింది, అని ఆమె దృఢనిశ్చయానికి వచ్చింది.

ప్రేమ ఒకటే సర్వమతాలను, సర్వదేశాలను మించి పైకి ప్రవహిస్తుంది. ఆ ప్రవాహం కొండలను, గోదావరి దాటినట్లు ప్రవహిస్తుంది. ఒక నీగ్రో పురుషుణ్ణి తెల్లజాతి స్త్రీ ప్రేమించి నడిస్తే అమెరికాతత్వం అడ్డం వస్తుందా?

ఏ యుగాలనాటిదో ఈ ప్రేమ! ఈ దివ్య సమాగమము యమునా గంగా సంగమమే అవుతుంది.

ఎందరు పార్శీలు ముస్లింమతంలో కలవలేదు. ఎందరు అసురకన్యలు ఆర్యవీరుల్ని ఉద్వాహం కాలేదు?

ఇలా తండ్రితో గంభీరంగా వాదించింది తహిమీనా.

# 8

వైకుంఠరావుకు అనుమానమే లేదు. పార్శీపత్రికలలో అల్లరి అతడు గమనింపలేదు. కొన్ని బెదరింపు ఉత్తరాలను అతడు లెక్కచేయలేదు.

ఆతడు మహాత్మునికి రాసి అనుమతి తెప్పించుకున్నాడు.

పార్శీసంఘమువారు పనికిరాదన్నారు. అనేక విధాల దాదాబాయి బాట్లీవాలాగారిని ఒత్తిడిచేశారు.

వేదాలలో, జెండ్ అవెస్టాలో గాథలుగా, ఋక్కులుగా పాడబడిన పాంచరసుధన్వా ప్రేమకథ నమహాబలం ఎవ్వరాపగలరు?

తహిమీనా తండ్రిఇంటికడనుండివచ్చి సబర్మతీ వెళ్ళిపోయింది. వైకుంఠరావు సబర్మతి చేరినాడు.

సబర్మతి ఆశ్రమంలో తహిమీనా వైకుంఠులవివాహం అతివైభవంగా జరిగింది.

# 9

ఆ దంపతులప్రేమ పవిత్ర సత్యాగ్రహవిజయం.

"ఓ దేవీ! తహిమీనా! ఏనాటిది మన యీ ప్రేమ?"

"ఆర్యవీరుడవు పంతం నెగ్గించుకున్నావు!"

"నీవు ఆర్యబాలికవు కావా? ఆర్యత్వం మహాత్మనిధర్మం అర్థంచేసుకోవడంలో ఉందికాదూ! నువ్వు ధర్మంకోసం మహోత్తమ సత్యాగ్రహం చేశావు ప్రాణప్రియా!"

తహిమీనా వైకుంఠుని హృదయంమీద వాలి, అతని తలవంచి మధురపరిమళంగా అతని పెదవులు తనివితీర ముద్దిడుకొంది. వైకుంఠుడు సర్వవిశ్వానికి మొక్కుకొన్నాడు ఈ దివ్యభామినిని తనకు ప్రత్యక్షంచేసినందుకు.

వారిద్దరూ దేశసేవా మహాయుద్ధంలో ఒకరికొకరు దగ్గరగా, ఒకరినడుంచుట్టూ ఒకరుగా భారతదేశంలోనికి అడుగిడుతూ నడుస్తున్నారు.